క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



దాచేపల్లి : స్థానిక ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు సోమవారం మైక్, స్పీకర్‌ను సోమవారం బహూకరించారు. వారధి పౌండేషన్ సభ్యురాలు సీహెచ్. దేవేందర్ కుటుంబ సభ్యులు రూ.10వేలు విలువ చేసే మైక్, స్పీకర్‌ను పౌండేషన్ వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు. విద్యార్థులకు ప్రయోజకరంగా ఉండే విధంగా స్పీకర్‌ను ఉపయోగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యామిని, సుహాసిని పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ మహాసభను జయప్రదం చేయండి



పిడుగురాళ్ల: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీలో జరిగే ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రచార కార్యక్రమాన్ని ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు నిర్వహించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాకుల కార్యాలయం, ఏరియా పశువైద్యశాల, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం అధికారులు, ఉద్యోగులను కలిసి సభను విజయవంతం చేయాలని తెలియ జేసినట్లు యూనియన్ నాయకులు తెలియజేశారు. అంతేకాకుండా ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు దామర్ల పట్టాభి, తాలూకా సెక్రటరీ మల్లవరపు ప్రభాకర్‌రావు, జాయింట్ సెక్రటరీల మన్నవ సాగర్‌బాబు, అబ్దుల్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడికి మూడేళ్ల జైలు

గన్నవరం: ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. 2021 డిసెంబర్ 17న స్థానిక బుద్దవరం రోడ్డులో సిమెంట్ బల్లపై కూర్చుని ఉన్న దండమూడి సరోజినీదేవి మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన వ్యక్తి అపహరించుకు పోయాడు. 2021 నవంబర్ 18న కేసరపల్లిలో కిరాణా షాపు నడుపుతున్న గుడివాడ సత్యవతి మెడలోని కాసున్నర కాసుల బంగారు గొలుసును ఆగంతకుడు తెంచుకెళ్లాడు. 2021 నవంబర్ 14వ తేదీ సాయంత్రం స్థానిక శ్రీనగర్‌కాలనీలో వాకింగ్ చేస్తున్న భూరగడ్డ కృష్ణకుమారి మెడలోని ఆరు కాసుల బంగారు గొలుసును కూడా స్నాచింగ్ చేశారు. ఈ మూడు ఘటనలపై కేసులు నమోదు చేసిన గన్నవరం పోలీసులు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ నాగుల్‌మీరా అలియాస్ బిల్లాను అరెస్ట్ చేశారు. స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో ఈ మూడు కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితుడు నాగుల్‌మీరాకు మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న తెలిపారు.

సొసైటీ భూములను సాగు చేసుకుంటాం

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎబిఎం టెనెన్స్ కో ఆపరేటివ్ సొసైటికి కేటాయించిన భూములను సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సభ్యులు పత్రా ఆనందరావు, పాతే సుధీర్‌కుమార్, మేదర దానియేలు, పాతే అమ్మయ్యలు సోమవారం తెలిపారు. 1936లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం 75.44 ఎకరాల భూములను తమ తాతలు, తండ్రులు సభ్యులుగా ఉన్న సొసైటికి కేటాయించి డీకె పట్టాలు ఇచ్చారని, ఈ భూములను ఓ సిమెంట్ ఫ్యాక్టరీ స్వాధీనం చేసుకునేలా కుట్రలు చేస్తుందన్నారు. ఈ భూములపై తాము న్యాయ పోరాటం చేస్తున్నామని, త్వరలోనే భూములను సాగు చేసుకుంటామని వారు చెప్పారు.

విద్యార్థులతో మానవహారం

చిలకలూరిపేట: ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల వలన మనం స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ, ఎన్ఆర్‌టీ సెంటర్‌లో మానవహారం సోమవారం నిర్వహించారు. గణపవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అంబేడ్కర్ గురు కుల పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని విద్యార్థులు కలిగి ఉండాలని కోరారు. వారి చరిత్రలను జీవన విధానాన్ని అధ్యయనం చేయాలని చెప్పారు. ర్యాలీ గురుకుల పాఠశాల నుంచి ప్రారంభమై పాత ప్రభుత్వాసుపత్రి వరకు కొనసాగింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకటనారాయణ, గల్లా సాంబశివరావు, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి కులమతాలకతీతంగా మేలు చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, సంక్షేమ పథకాలను ప్రతి పేద కుటుంబానికి అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఘనత సీఎం జగన్‌దేనని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 10వ వార్డులోని సెరిన్ కాలనీ సచివాలయ పరిధిలో వార్డు కౌన్సిలర్ సిద్దయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు మేలు చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలందరికీ ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించి పేద కుటుంబాల్లో వెలుగు నింపుతున్నారన్నారు. ఏ సంక్షేమ పథకమైనా అర్హతే ధ్యేయంగా తీసుకుని మంజూరు చేసి పారదర్శకంగా అందజేయడంలో జగనన్న ప్రభుత్వం ముందంజలో ఉందని పేర్కొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు...

ప్రతి గడపకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే మేలు జరుగుతుందని, ప్రతి పథకం కొనసాగుతుందని, అందుకే మరొక్క సారి జేజేలు పలకాలని పీఆర్కే చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అర్హత ఉండి పథకాలు పొందలేని వారు పథకాలు పొందే విధంగా చర్యలు తీసుకున్న మొట్టమొదటి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేయించి వారోత్సవాలు జరుపుతూ ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి అండగా నిలబడి మరోసారి సీఎం జగన్‌కు జేజేలు పలకాలని ప్రభుత్వ విప్ కోరారు. 10వ వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ 314 గృహాలను సందర్శించి లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా చేకూరిన పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. వైఎస్సార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాత్రి 11గంల వరకు కొనసాగినా ప్రజలందరూ, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, పురపాలక సంఘం, వివిధ ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నేటి వరకూ వారి ఖాతాల్లో చూసుకుంటే వారికే తెలుస్తోందన్నారు. అర్హులై ఉండి పథకాలు రాని వారు ఉంటే పథకాలు మంజూరు చేయించే బాధ్యత తనదేనని పీఆర్కే అన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, ఆయా వార్డు కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, షేక్ దస్తగిరి, పోలా శ్రీను, చంద్రకుమార్, తేరాల సిద్దయ్య, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మందా సంతోష్, ఎన్ శ్రీనివాస్, షేక్ సుభాని, కరిముల్లా, మస్తాన్, రామగాని శంకర్, చందూ గౌడ్, కో ఆప్షన్ మెంబర్లు అల్లి జీవన్, అనంతరావమ్మ, యాసిన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కమిషనర్ రమణబాబు, ఏఈ సామేల్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వివరాలు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి ఉదయం 9.30 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని మున్సిపాలిటీలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జెండా వందన కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తెలియజేశారు. 10 గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం కార్యక్రమంలో పాల్గొని అనంతరం పట్టణం హౌస్‌లోనే అందుబాటులో ఉంటారు.

మాంసం విక్రయాలు చేపట్టరాదు

నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాస్

గురజాల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మాంసం విక్రయాలు చేపట్టరాదని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా మాంసం విక్రయాలు చేపట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా మాంసం విక్రయాలు చేపడుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

అపూర్వం...ఆత్మీయం



విజయపురిసౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్‌లో కలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

విజయపురిసౌత్ : సుమారు 26 ఏళ్ళ క్రితం ఆడిపాడారు. ఆ తరువాత విడిపోయారు. సుదీర్ఘ జీవన ప్రయాణంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. జీవితం యాంత్రికమైపోయింది. మనసులో ఏదో తెలియని వెలితి అందరిని పట్టి పీడించింది. మూలమేదో గుర్తించారు. ఒక్కసారి చిన్ననాటిస్నేహితులను కలుసుకోగలిగితే చాలు అనుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 25 మంది చిరునామాలను సేకరించారు. 1996–97 బ్యాచ్‌లో 10వ తరగతి ఎస్ఆర్‌హెచ్ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు సోమవారం మరోసారి విజయపురిసౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్‌లో తిరిగి కలుసుకుని ఒకే వేదికపై చేరుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం.. అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. అపురూపమైన జ్ఞాపకాలను తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూఫ్ ఫోటోలు దిగారు. తమ తోటి పూర్వ విద్యార్థులు కలిసేందుకు అందరి చిరునామాలు సేకరించి ఒకే వేదికపై తీసుకువచ్చేందుకు కృషి చేసిన నవరాజ్‌ను పూలదండలు, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరెడ్డి, నవరాజ్, అనీల్, భాస్కర్, సుధీర్‌రెడ్డి, వెంకట్, ఫణి, భాను కళ్యాణ్, కిషోర్, శ్రీకాంత్, స్టాలిన్, గౌస్, ప్రదీప్, రామ్‌లక్ష్మణ్, అజహర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించాలి

ఆర్డీఓ అద్దయ్య



సమీక్ష చేస్తున్న ఆర్డీఓ అద్దయ్య

దాచేపల్లి : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల సర్వే తప్పనిసరిగా చేపట్టాలని గురజాల కె. అద్దయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బీఎల్వోల సమావేశం సోమవారం జరిగింది. బూత్‌ల వారీగా చేపట్టిన సర్వే వివరాలు ఆర్డీఓ అడిగితెలుసుకున్నారు. సర్వే సక్రమంగా నిర్వహించని బీఎల్వోలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా ఓటర్ల సర్వే నిర్వహించాలని, ఏ పార్టీలకు అనుకూలంగా బీఎల్వోలు వ్యవహరించవద్దని చెప్పారు. ఓటర్ల మార్పులు, చేర్పుల విషయంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల అభ్యంతరాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని, బీఎల్వోలు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ శోభారాణి, కమిషనర్ వి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం తదితరులున్నారు.

ఉర్దుపాఠశాల పునరుద్ధరణకు చర్యలు

ఎంఈఓ వేముల నాగయ్య



ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తున్న ఎంఈఓ-1 వేముల నాగయ్య

తుమ్మకోట(రెంటచింతల): గ్రామస్తులు తమ పిల్లలను ఉర్దుపాఠశాలలో చేర్పిస్తే వెంటనే పాఠశాల పునరుద్దరణకు చర్యలు తీసుకుంటామని మండల ఎంఈఓ-1 వేముల నాగయ్య అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఉర్దుపాఠశాలను సందర్శించి మాట్లాడారు. గత ఏడాది పిల్లలు చేరకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉర్దుపాఠశాలను మూసివేయడం జరిగిందన్నారు. గ్రామ పెద్దల నుంచి వచ్చిన పలు వినతుల మేరకు పాఠశాలను పున:ప్రారంభించేందుకు అవకాశాలను పరిశీలించారు. పిల్లలను చేర్పిస్తే ఎటువంటి అభ్యంతరం లేదని ఖచ్చితంగా ఉర్దుపాఠశాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ముందుగా ఎంపీపీఎస్(హెచ్‌డబ్ల్యూ) పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎంపీపీఎస్(ఎం) పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు వివరించారు.

ఓటర్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ అద్దెయ్య



వీఆర్‌ఓలు, కార్యదర్శులతో మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్

మాచవరం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన ఓటరు సర్వే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డీఓ అద్దెయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్ఓలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఇప్పటి వరకు జరిగిన సర్వే పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది కొరత కారణంగా సర్వే వేగవంతం చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లను బీఎల్ఓలుగా నియమించడం జరిగిందన్నారు. బీఎల్ఓలు తమకు కేటాయించిన ప్రతి ఇంటిని సందర్శించి, నూతన ఓట్ల చేర్పులు, సవరణలు నమోదు చేయాలని, మరణించిన ఓటర్లను కుటుంబ సభ్యుల ఆమోదంతో ధృవీకరిస్తూ తొలగించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేయాలని తెలియ జేశారు. సమావేశంలో తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీఓ వరప్రసాద్, సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు 18 సంవత్సరాలు నిండిన వారి దరఖాస్తులు తీసుకోవటమే కాకుండా ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలని తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశంలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కొత్తవారికి ఓటు హక్కు కల్పించడంతో పాటు పాత జాబితాలో మరణించిన, వలసలు, ఒకే డోర్ నెంబర్ పై నమోదైన ఓట్ల వివరాలను నిశితంగా పరిశీలించాలన్నారు. జాబితా సవరణలో ఎటువంటి నిర్లక్ష్యం వ్యవహరించకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిటీ షేక్ బాషా, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఆర్ఐలు ఫణీంద్ర, శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు ఎ నాగేశ్వరరావు, గోపాల్ రెడ్డి, కాశి, కార్యదర్శులు వెంకట్రామయ్య, దస్తగిరి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నూర్ బాషా సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాశీం సైదా



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న ఖాశీం సైదా

పిడుగురాళ్ల: విజయవాడలోని ఆశ పంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ పీరా మహ్మద్ చేతులు మీదుగా నూర్ బాషా సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల ఖాశీం నియామక పత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా నూర్ బాషా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా దూదేకుల సలీమ్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అప్పగించిన ఈ బాధ్యతలను శక్తి వంచన లేకుండా నూర్ బాషా జాతి అభివృద్ధికి కృషి చేస్తామని, పల్నాడు ప్రాంతంలో ఉన్న నూర్ బాషాలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలియజేశారు. వీరి నియామకంపై పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు అంజూసాహెబ్, తొల్లా సైదా, ఎస్‌బీ టైలర్ సైదా, దూదేకుల బాబు, దూదేకుల ఖాశీం, సయ్యద్ హుస్సేన్, మస్తాన్, రాజుపాలెం మండల అధ్యక్షుడు ఖాశీం సైదా, మాచవరం మండల అధ్యక్షుడు బాజీ, ఖాజా, దస్తగిరి, సైదు బాబు, బాషాలు అభినందనలు తెలియజేశారు.

పలుగ్రామాల్లో నా భూమి నా దేశం



నా భూమి నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దాసరి చాడేశ్వరి

రెంటచింతల: నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే ప్రత్యేక కార్యక్రమం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో చేపట్టిన ఎంతో గొప్ప కార్యక్రమని ఎంపీపీ దాసరి చాడేశ్వరి అన్నారు. సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపి వారి ఆధ్వర్యంలో రెంటాల, మంచికల్లు, పాలువాయి గేటు గ్రామాల్లో తలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయాలలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించి, మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలను నాటి మాట్లాడారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన స్థానిక మహనీయులు, సాహసవంతులు, వీరులను స్మరించుకోవాల్సిందన్నారు. పుట్టుకతోనే ఈ దేశంపై బంధం పెంచుకున్న మనం దేశభక్తి స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఏర్పాటు చేసిన జ్ఞాపిక శిలాఫలకాల వద్ద సెల్ఫీలను దిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వివిధ గ్రామాల్లో మొత్తం 1,045 మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన మంచి వాతావరణాన్ని అందించాలని కోరారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, సర్పంచ్‌లు పొట్లపాటి చంద్రారెడ్డి, చింతా సుబ్బారావు, కటికల భాగ్యమ్మ, ఈఓపీ ఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఏపిఓ జయ చంద్ర, కార్యదర్శులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి నిదర్శనమే మహిళా మార్టు

నరసరావుపేట: రాష్ట్రంలో మహిళలు అంచలంచెలుగా ఎదుగుతున్నారనటానికి వైఎస్సార్ చేయూత మహిళా మార్టు ఒక ప్రతీకని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో డ్వాక్రా మహిళలు తమకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల సహకారంతో జిల్లాలో తొలిసారిగా రూ.16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రకాష్‌నగర్ పదో వార్డులో అట్టహాసంగా మహిళా మార్టు ప్రారంభానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత, సున్నావడ్డీ, ఆసరా పథకా లతో మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారన్నారు. ప్రభుత్వ సహకారంతో ప్రతి డ్వాక్రా గ్రూపు సీడీ గ్రూపు నుంచి ఏ గ్రూపునకు చేరిందన్నారు. ప్రతీ గ్రూపు రూ.20 లక్షలు రుణం తీసుకునే అవకాశం సీఎం జగన్ కల్పించారన్నారు. దీనికి సీఎం జగన్‌కు అందరూ ధన్యవాదాలు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. అయితే జాగ్రత్తగా మార్టును నిర్వహించాలని మహిళలకు సూచించారు. వేరే వారికి రుణం ఇచ్చే స్థాయికి డ్వాక్రా మహిళలు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారిత సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.26 వేల కోట్ల రుణమాఫీ అమలుతో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు.

గతంలో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన అన్నీ వాగ్దానాలను నెరవేర్చలేకపోయాడని విమర్శించారు. నియోజకవర్గంలో 2819 గ్రూపులకు రూ.500 కోట్ల రుణాలు బ్యాంకులు ఇవ్వటం సామాన్యమైన విషయం కాదన్నా రు. చేయూత, ఆసరా ద్వారా రూ.105 కోట్లు ప్రభుత్వం అందజేసిందన్నారు. ఎనిమిది వేల మంది రూ.200లు చొప్పున రూ.16 లక్షలు సమకూర్చుకొని మార్టును ఏర్పాటు చేయటం అభినందించతగ్గ విషయమన్నారు. వ్యాపారం పారదర్శకతో నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గంలో 85 వేల మంది డ్వాక్రా మహిళ లు ఉండగా కేవలం 8 వేల మందే పెట్టుబడి పెట్టారన్నారు. మిగతా వారుకూడా పెట్టుబడి పెడితే పట్టణంలో నాలుగువైపులా ఇటువంటి మార్టులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇవి ప్రజల ఆదరణ పొందుతాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఈసందర్భంగా శ్రీనిధి కింద రొంపిచర్ల మండలంలోని 11 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.75 వేలు చొప్పున రూ.85 లక్షల విలువైన 11 గ్రౌరైల యూనిట్లను పంపిణీ చేశా రు. నరసరావుపేట మండలంలోని లబ్ధిదారులకు 37 గేదెలను అందజేశారు. అలాగే నియోజకవర్గంలోని 180 మంది డ్వాక్రా మహిళలకు జీవనోపాధి కింద ఒక్కొక్కటీ రూ.7,500లు విలువైన 180 కుట్టు మిషన్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీతో డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. స్వాతంత్ర దినోత్సవాన్నీ పురస్కరించుకొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. శ్రీనిధి కింద మంజూరైన రుణానికి చెందిన నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. మార్టును సందర్శించారు. అనంతరం తమ ఆర్థికాభివృద్ధికి సహకారమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ఆషాబేగం ఖాజావలి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ముతరాసు, గిరిజన, మాదిగ కార్పొ రేషన్ల డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి పాల్గొన్నారు.

మోర్జంపాడులో వార్డు మెంబర్ ఎన్నిక ఏకగ్రీవం

మాచవరం: ఎన్నికల ఆదేశాల మేరకు మండలంలోని మోర్జంపాడు ఒకటో వార్డు మెంబర్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఈఏపీఆర్‌డీ డి.వెంగళరావు తెలిపారు. వార్డు మెంబర్ ఎన్నికకు రెండు నామినేషన్లు దాఖలు కావడంతో, కంకర పార్వతమ్మ నామినేషన్ ఉపసంహరణ చేసుకోవడంతో ఓసీ మహిళ రిజర్వేషన్‌కు వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు బత్తుల రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన రమాదేవిని పలువురు నాయకులు అభినందించారు.

పిల్లుట్లలో పోటీ...

నామినేషన్ల ఉపసంహరణ రోజున ఎలాంటి నామినేషన్లు ఉపసంహరణ చేయకపోవడంతో పిల్లుట్ల 9వ వార్డుకు ఎన్నికకు పోటీ నెలకొంది. వార్డు మెంబర్లుకు బాహాటం వెంకటలక్ష్మి, ముజావర్ మీరాభిలు నామినేషన్లు వేయడంతో ఈనెల 19న ఎన్నిక జరుగుతుందని ఎన్నికల అధికారి, ఎంఈఓ–2 డి.శ్రీధర్ తెలిపారు.